

వయనాడ్ బాధితులకు 'ప్రజాశక్తి' విరాళాల సేకరణ

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: కేరళ వయనాడ్ వరద బాధితులకు 'ప్రజాశక్తి' సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ఎడిషన్ సిబ్బంది మంగళవారం విరాళాలను సేకరించారు. రేణిగుంట సిఆర్ఎస్, ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో నిర్వహించారు. రేణిగుంట సిఆర్ఎస్ సిబ్బంది నుంచి మంచి స్పందన వచ్చిందని 'ప్రజాశక్తి' మేనేజర్ సిఎస్ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈవిరాళాల సేకరణలో డెస్క్ ఇన్‌ఛార్జి ఎ.వనజ, సమన్వయ కమిటీ సభ్యులు శ్రీనివాస్, గుణశేఖర్, నాగరాజు, సురేష్, డివిజన్ ఇన్‌ఛార్జిలు దాము, వెంకట్రావ్, ప్రశాంత్, రామాంజులు పాల్గొన్నారు.

కనిపించే దేవుళ్లే శాస్త్రవేత్తలు

డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

ప్రజాశక్తి- సూళ్లూరుపేట: మనకు ప్రత్యక్షంగా కనిపించే దేవుళ్లే శాస్త్రవేత్తలని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. జాతీయ అంతరిక్ష దినోత్సవానికి తనని ఆహ్వానించడం చాలా ఆనందంగా ఉందనీ తెలిపారు. శాస్త్రవేత్తల మీద అపారమైన గౌరవం ఉందని, భారతదేశ చిత్రపటాన్ని అగ్రస్థానానికి తీసుకొచ్చిన ప్రతిఒక్క శాస్త్రవేత్తలకు జోహార్లు తెలిపారు. ఉపగ్రహాలను అంతరిక్ష కక్షలోకి ప్రవేశపెట్టాలంటే ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపి ఉంటారని శాస్త్రవేత్తలను కొనియాడారు. ఒకే ఉపగ్రహం ద్వారా 108 శాటిలైట్లను అంతరిక్షంలోకి పంపించడం అంటే మాటలు కాదని, అది మన శాస్త్రవేత్తలకే సాధ్యమైందని తెలిపారు. స్కూలు విద్యార్థి నుంచి తనకు షార్ కేంద్రమైన శ్రీహరి కోటను చూడాలని కల ఉండేదనీ, నేటికీ కల నిజమైందనీ ఆనందం వ్యక్తం చేశారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోగాలు చేయడం ఇస్రోకే సాధ్యపడుతుందని అన్నారు. ప్రయోగాలు విఫలమైన తరుణంలో వెన్నుంటి ప్రోత్సహించి శాస్త్రవేత్తలకు ధైర్యమిచ్చి మరలా ప్రయోగంలో సక్సెస్ సాధించిన ప్రయోగమే చంద్రయాన్-2 ప్రయోగమని, భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీని కొనియాడారు. ముందుగా రేణిగుంట విమానాశ్రయం నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో శ్రీహరికోటకు చేరుకున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్‌లోనీ నక్షత్ర గెస్ట్‌హౌస్‌కి చేరుకున్నారు. అనంతరం జాతీయ అంతరిక్ష దినోత్సవం వేడుకలలో పాల్గొన్నారు. షార్‌లోని ఎంఆర్ కురూప్ ఆడిటోరియంలో జరిగే అంతరిక్ష దినోత్సవ వేడుకల్లో పాల్గొని జోతి ప్రజ్వలన చేసి అంతరిక్ష దినోత్సవ వేడుకలను ఘనంగా ప్రారంభించారు. అనంతరం షార్‌లోని అన్ని విభాగాలను, రాకెట్ అనుసంధానాన్ని పరిశీలించారు. షార్ డైరెక్టర్ రాజరాజన్, డిప్యూటీ డైరెక్టర్ రఘురాం, అసోసియేట్ డైరెక్టర్ సయ్యద్, షార్ కంట్రోలర్ శ్రీనివాసులు రెడ్డి, సూళ్లూరుపేట నియోజకవర్గం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, కలెక్టర్ వెంకటేశ్వర్ ఎస్పీ సుబ్బరాయుడు, శాస్త్రవేత్తలు ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన రోడ్డు వేయాలి...

బెంగళూరు నుండి ఉపగ్రహాలను తీసుకువచ్చే క్రమంలో రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయని శాస్త్రవేత్తలు డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌ని తెలిపారు. ఆయన వెంటనే స్పందించి కలెక్టర్‌తో మాట్లాడి బుచ్చినాయుడు కండ్రిక నుంచి మన్నారు, పోలూరు వరకు శ్రీ కాళహస్తి రోడ్డును 17 కిలోమీటర్ల మేర యుద్ధ ప్రాతిపదికన రోడ్లను వేయాలని దానికి సంబంధించిన నిధులను ప్రభుత్వంతో మాట్లాడి వెంటనే సమకూరుస్తానని హామీ ఇచ్చారు.

పవన్ కళ్యాణ్‌కు ఘనస్వాగతం

తిరుపతి టౌన్: రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయితీ రాజ్, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌కు ఘన స్వాగతం లభించింది. మంగళవారం ఉదయం 10.15 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఉప ముఖ్యమంత్రికి కలెక్టర్, వెంకటేశ్వర్, జెసి శుభం బన్సల్, ఎస్పీ సుబ్బరాయుడు, తిరుపతి మునిసిపల్ కమిషనర్ నారపు రెడ్డి మౌర్య, ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, ఆర్డీఓలు నిషాంత్‌రెడ్డి, రవిశంకర్‌రెడ్డి, ఎస్‌డిసి ప్రోటోకాల్ చంద్రశేఖర్ స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో షార్‌కు బయల్దేరి వెళ్లారు. ఇస్రో సందర్శన కోసం విచ్చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను దిశ మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్, పంచాయతీరాజ్ శాఖ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సభ్యులు పిసి రాయల్ సత్కరించారు.

టిడిఆర్ బాండ్‌ల జారీలో అవకతవకలు

తిరుపతి టౌన్ ప్లానింగ్ సిటీ ప్లానింగ్ అధికారి బాలసుబ్రమణ్యం బదిలీ

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

వైసిపి ప్రభుత్వం హయంలో తిరుపతి మాస్టర్‌ప్లాన్ రోడ్ల పేరుతో ప్రజల భూములు బలవంతంగా తీసుకొని టిడిఆర్ బాండ్ల అక్రమాల్లో ప్రముఖపాత్ర పోషించారని తిరుపతి అసిస్టెంట్ సిటీ ప్లానింగ్ అధికారి బాలసుబ్రమణ్యం డిప్యూటేషన్ రద్దు చేస్తూ తిరుపతి నుంచి ఆయనను బదిలీ చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ హాస్టల్ సిటీప్లానర్‌గా పనిచేస్తున్న బాలసుబ్రమణ్యం వైసిపి ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేయడమే కాకుండా మాస్టర్ ప్లాన్ రోడ్ల పేరుతో టిడిఆర్ బాండ్లను అర్హులకు పంపిణీ చేయకుండా అనర్హులకు పంపిణీ చేసి అక్రమాలకు పాల్పడ్డారంటూ తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి రవి నాయుడు రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో భాగంగా రాజంపేట మున్సిపాలిటీ నుంచి డిప్యూటేషన్ కింద మూడు సంవత్సరాల క్రితం తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు అసిస్టెంట్ సిటీ ప్లానింగ్ అధికారిగా బాలసుబ్రమణ్యం విధుల్లో చేరారు. వైసిపి ప్రభుత్వంలోనే బాలసుబ్రహ్మణ్యం రాజంపేట నుంచి తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో చేరేందుకు ప్రయత్నాలు చేసి విఫలమయ్యారు. ఈయనపై అనేక అవినీతి ఆరోపణలు ఉండడంతో అప్పటి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి బాలసుబ్రహ్మణ్యం తిరుపతి కార్పొరేషన్‌లో చేర్చుకోవడానికి ఇష్టపడలేదు. అయితే తిరుపతి నగర అభివృద్ధి కోసం సమర్థవంతమైన టౌన్ ప్లానింగ్ అధికారి కోసం వెతుకుతున్న సమయంలో బాలసుబ్రహ్మణ్యం తిరుపతి కార్పొరేషన్‌లో అసిస్టెంట్ సిటీ ప్లానింగ్ అధికారిగా తీసుకోవడానికి సుముఖత వ్యక్తం చేశారు. తిరుపతి నగరంలో 14 మాస్టర్ ప్లాన్ రోడ్లను వేయడం జరిగింది. సుమారు 3 ఎకరాల భూమిని తీసుకొని రోడ్లు వేశారు. 1258 మందికి టీడీఆర్ బాండ్లు ఇవ్వాల్సి ఉంది. అయితే 300 మందికి టీడీఆర్ బాండ్లు జారీ చేసినట్లు సమాచారం. అయితే ఈ టిడిఆర్ బాండ్ల జారీలో అనేక కోట్లాది రూపాయలు చేతులు మారినట్లు రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం జరుగుతుంది.

ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు అర్హులైన వారికి టిడిఆర్ బాండ్లు ఇవ్వడమే కాకుండా అవకతవకలు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. రాష్ట్రంలో తిరుపతితో పాటు విశాఖపట్నం రాజమండ్రి విజయవాడ ప్రాంతాల్లో భారీగా టిడిఆర్ బాండ్ల పంపిణీలు అవకతవకలు జరిగాయని ఆరోపణలు ఉన్నాయి. దీనిపై కోర్టులో కేసులు కూడా నడుస్తున్నాయి. మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు టిడిఆర్ బాండ్ల జారీలో అవకతవకలు జరిగిన మాట వాస్తవమేనని అర్హులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత టిడిఆర్ బాండ్ల జారీ చేయడంలో నిలిపివేశారు. దీనిపై ఒక కమిటీని వేసి అర్హులను గుర్తించి టిడిఆర్ బాండ్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తుంది. ఇది ఇలా ఉండగా తిరుపతి అసిస్టెంట్ సిటీ ప్లానింగ్ అధికారిగా ఉన్న బాలసుబ్రహ్మణ్యం గతంలో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో ఆదాయాన్ని మించి ఆస్తులు కలిగి ఉన్నారని ఏసీబీ అధికారులు అరెస్టు చేసి జైలుకు పంపిన విషయం తెలిసిందే.

బదిలీ అయిన తిరుపతి అసిస్టెంట్ సిటీ ప్లానింగ్ అధికారి బాలసుబ్రమణ్యం

మరికొందరిపై వేటు..

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో టిడిఆర్ బాండ్ల జారీలో పెద్దఎత్తున అవకతవకలు జరిగాయని ఆరోపణలు ఉండడంతో టౌన్ ప్లానింగ్‌లో పనిచేస్తున్న మరికొందరిపై వేట పడే అవకాశాలున్నాయి. వీరు గతంలో వైసిపి ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించడమే కాకుండా అర్హులకు న్యాయం చేయకుండా అనర్హులకు టిడిఆర్ బాండ్ల జారీలో వీరి పాత్ర ఎక్కువ ఉన్నట్లు తెలుస్తోంది. టౌన్ ప్లానింగ్‌లో అనేకమంది ప్లానింగ్ విభాగంలో ఉన్న అధికారులపై చర్యలు త్వరలో తీసుకోనున్నట్లు సమాచారం. అయితే టిడిఆర్ బాండ్ల జారీలో అప్పటి కమిషనర్‌పై కూడా చర్యలు తీసుకోవాలని టిడిపి నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో డీఈగా పనిచేస్తున్న విజయ్ కుమార్‌రెడ్డి పై కూడా చర్యలు తీసుకోవాలని టిడిపి నేతలు పేర్కొనడం జరిగింది. ఆయనపై కూడా త్వరలో వేటు వేసే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది.

నిర్లక్ష్యపు అధికారులపై చర్యలు

ఆసుపత్రి నుంచి విద్యార్థులు డిశ్చార్జి, తరగతులకు హాజరు

భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరిగితే సహించేది లేదు : మంత్రి

ప్రజాశక్తి- తిరుపతిలో టౌన్ : రేణిగుంట బీసీ వసతి గృహంలో అస్వస్థతకు గురైన 21మంది ఆరోగ్య పరిస్థితి పూర్తిగా మెరుగుపడిందని, రుయా ఆసుపత్రి వైద్యులు డిశ్చార్జి చేశారని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఆరోగ్యం మెరుగుపడడంతో విద్యార్థులు పాఠశాలకు వెళ్లినట్లు తెలిపారు. ఈ ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహించిన బీసీ వసతి గృహ అధికారులపై చర్యలు తీసుకోవాలని తిరుపతి జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారులను మంత్రి ఆదేశించారు. ఈమేరకు మంగళవారం మంత్రి సవిత ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ విషయం తెలిసినప్పటి నుంచి ప్రతిక్షణం తిరుపతి డీఎం అండ్ హెచ్‌వోతో, రుయా ఆసుపత్రి వైద్యులతో మాట్లాడుతూ, విద్యార్థులకు మెరుగైన వైద్యమందేలా కృషి చేశామన్నారు. అదే సమయంలో బీసీ వెల్ఫేర్ డీడీని ఆసుపత్రికి పంపి, విద్యార్థులకు వైద్య సదుపాయాలు అందించేలా చేశామన్నారు. ఆరోగ్యం పూర్తిగా మెరుగుపడడంతో, ప్రస్తుతం విద్యార్థులు పాఠశాలకు కూడా వెళ్లినట్లు మంత్రి తెలిపారు. బయట ఆహారం తినడం వల్లే విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారన్నారు. విద్యార్థులకు వాంతులు విరేచనాలు జరిగినా పైఅధికారులకు తెలియజేయకపోవడంపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. తమ పిల్లలకు ఇలాగే జరిగితే వదలేస్తారా..? అని వసతి గృహ సిబ్బందిపై మండిపడ్డారు. ఇది క్షమించరాని నేరమని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకూడదని, హాస్టళ్లలో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని హాస్టళ్ల సిబ్బందికి, అధికారులకు మంత్రి స్పష్టం చేశారు. మరోసారి ఇటువంటి ఘటన రాష్ట్రంలో ఎక్కడైనా చోటుచేసుకుంటే తీవ్రపరిణామాలు ఉంటాయని బీసీ హాస్టళ్ల సిబ్బందిని, అధికారులను మంత్రి హెచ్చరించారు.

ఇద్దరు అధికారులకు షోకాజ్ నోటీసులు

తిరుపతి– రేణిగుంట బీసీ వసతి గృహం విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనలో మంత్రి సవిత ఆదేశాల మేరకు ఇద్దరు అధికారులకు బీసీ వెల్ఫర్ అధికారులు మంగళవారం షోకాజ్ నోటీసులు జారీచేశారు. ఇన్చార్జి బీసీ వెల్ఫేర్ అధికారి చంద్రశేఖర్‌కు, ఏబీసీడబ్ల్యూఓ డి.జ్యోత్స్నకు బీసీ వెల్ఫేర్ డైరెక్టర్ మల్లికార్జున ఈనోటీసులు జారీ చేశారు. నోటీసులందుకున్న మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆ నోటీసుల్లో స్పష్టం చేశారు.

శ్రీవారి సేవలో నటి జాన్వీ కపూర్

ప్రజాశక్తి- తిరుమల: శ్రీదేవి 61వ జయంతి ఈ సందర్భంగా తిరుమల శ్రీవారిని నటి జాన్వీ కపూర్ దర్శించుకుంది. ముందుగా ఆమె మెట్ల మార్గంలో అలిపిరి చేరుకున్నారు. అక్కడ నుంచి సంప్రదాయ చీరకట్టులో స్నేహితుడు శిఖర్ పహారియాతో కలిసి ఉదయం వీఐపీ విరామ దర్శన సమయంలో శ్రీవారిసేవలో పాల్గొన్నారు. ముందుగా ఆలయానికి చేరుకున్న జాన్వీకి తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

ఎఫ్ఎంఎస్ కార్మికులకు సమస్యలపై

టీటీడీ ఈవోకు సిఐటియు వినతి

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: శ్రీవారి భక్తులకు సేవ చేస్తున్న టీటీడీ ఎఫ్ఎంఎస్ కార్మికులకు దర్శన సౌకర్యం కల్పించాలని, లడ్డు కార్డు మంజూరు చేయాలని, మహిళా కార్మికులు బట్టలు మార్చుకోవడానికి ప్రత్యేక గది వసతి సౌకర్యం కల్పించాలని, బ్రహ్మోత్సవాలలో పనిచేసిన కార్మికులకు బోనస్‌తో పాటు లడ్డు, వడ ఇవ్వాలని అలాగే ప్రతినెలా 5వ తేదీ లోపు జీతాలు చెల్లించాలని కోరుతూ మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో టీటీడీ ఈవో జే.శ్యామల రావుకు వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా టీటీడీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు టి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఎఫ్ఎంఎస్ కార్మికులకు ఎంప్లాయిస్ క్యాంటీన్‌లో భోజన వసతి సౌకర్యం కల్పించాలని కోరారు. మిషన్ ఆపరేటర్లకి, బ్లాక్ రిమూవర్స్‌కి సెమీ స్కిల్డ్ వేతనాలు ఇవ్వాలని, లాకర్ బాయ్స్‌కి స్కిల్డ్ వేతనాలు వర్తింపచేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు ప్రభాకర్, సిద్ధయ్య (సిద్దు) చిరంజీవి, కేశవులు తదితరులు పాల్గొన్నారు.



టిటిడి నిర్మాణ పనుల్లో అక్రమాలు..?

- **రాష్ట్ర విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్‌చే విచారణ**
- **కొందరు ఇంజనీర్లపై చర్యలకు ఉపక్రమణ**
- **పోరుబాట పట్టనున్న ఇంజనీర్లు**
- **నేడు కీలకభేటీ, నిర్ణయం**

ప్రజాశక్తి- తిరుపతి సిటీ:

రాష్ట్ర విజిలెన్స్ విభాగం టిటిడిలో అగ్గిరాజేసింది. ఇంజనీర్లు మరో రెండో రోజుల్లో తీసుకునే నిర్ణయంతో పోరుబాట పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ధార్మిక సంస్థలో ఇదే చర్చ జరుగుతోంది. టిటిడిలోని పలు నిర్మాణాల్లో అక్రమాలు జరిగాయంటూ విజిలెన్స్ విభాగం జారీ చేసిన షోకాజ్ నోటీసులు టిటిడిలో అగ్గిరాజేసింది. పాలకమండలి, పాలన అధికారులను వదిలేసి మాపై గురి పెట్టడం ఏంటి అని ఇంజనీర్లు సూటిగా ప్రశ్నిస్తున్నారు. ఇంజనీరింగ్ శాఖ పెద్దల ఓదార్పు, టిటిడి ఈవో దాటువేత సమాధానం ఆ విభాగం అధికారుల్లో మరింత అసంతృప్తి రాజేసింది. ఈ వ్యవహారం టిటిడిలో ప్రధానంగా చర్చ జరుగుతోంది. విజిలెన్స్ విచారణ వ్యవహారం రాష్ట్ర ప్రభుత్వంపైనే కాకుండా, అధికార టిడిపిపై ప్రభావం చూపించే వాతావరణం లేకపోలేదు. రాష్ట్ర ప్రభుత్వ విజిలెన్స్ విభాగం తీసుకోబోయే నిర్ణయాలపై టిటిడి ఉద్యోగుల్లో మరింత ఆగ్రహం పెల్లుబికే ప్రమాదం లేకపోలేదు. సర్వీసు రూల్స్ ప్రకారం తమ విధులు తాము నిర్వహిస్తే, తమ పైనే చర్చలు తీసుకోవడానికి సంసిద్ధం కావడం ఏంటి అని ఏఈలు ప్రశ్నిస్తున్నారు. టిటిడి పాలకమండలిలో తీసుకునే నిర్ణయాల మేరకు, ఉన్నతస్థాయి అధికారులు జారీ చేసే ఆదేశాలను అమలు చేయడమే తమ విధి అని, నిర్ణయాలు తీసుకున్న వారిని కాదని ఉద్యోగులపై చర్యలు ఏంటని ఇంజనీరింగ్ శాఖ అధికారులు ప్రశ్నిస్తున్నారు.

టిటిడిలో ఇదే చర్చ..

టిటిడి చరిత్రలో మొదటిసారి అధికారులు ఈ తరహా ఒత్తిడికి గురయ్యారు. సాధారణంగా టిటిడిలో అంతర్గత చర్యలు తీసుకునేవారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విజిలెన్స్ విచారణకు ఆదేశించిన నాటి నుంచే టిటిడిలో చర్చ జరుగుతోంది. నిర్ణయాలు చేసిన రాజకీయ ప్రతినిధులు, నిధులు మంజూరు చేసిన ఉన్నతస్థాయి అధికారులను వదిలేసి, క్షేత్రస్థాయి అధికారులను టార్గెట్ చేయడంపై చర్చ జరుగుతోంది. టిటిడి ఇంజనీర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కఠిన నిర్ణయం తీసుకుంటే ఆ ప్రకంపనలు తీవ్రంగా ఉంటాయనడంలో సందేహం లేదు.

వారిపైనే ఫోకస్..

వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వ పాలనలో ఐదేళ్ల పాటు తిరుమల, ఆ తర్వాత టిటిడి అదనపు ఈవోగా ఏవి ధర్మారెడ్డి పని చేశారు. తిరుపతి మాజీ ఎంఎల్ఏ, టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి కాలంలో జరిగిన పనులు, నిధులు వినియోగంపై ఫోకస్ పెట్టింది. వారి పాలనలో ఇంజనీరింగ్, శ్రీవాణి ట్రస్టులో అక్రమాలు జరిగాయంటూ రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ కమిటీ విచారణకు ఆదేశించింది. రెండు నెలల పాటు సుదీర్ఘంగా రాష్ట్ర విజిలెన్స్ తిరుమలతో పాటు తిరుపతిలోని టిటిడి పరిపాలన భవనంలో అనేక శాఖల్లో విచారణ చేయడంతో పాటు కంప్యూటర్ హార్డ్ డిస్కులు కూడా స్వాధీనం చేసుకుంది. అక్రమాలు, అవినీతి, అన్యాయాలు, దేవిడి సొమ్ము దుర్వినియోగం చేసిన వారిని గుర్తించామని చెబుతున్నారు. ఆధారాలు కూడా సేకరించారు. ఇప్పటి వరకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. వీటన్నింటిపై విచారణ జరిపి, నిందితులను శిక్షిస్తామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం నియమించిన విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు ఇప్పటి వరకు ఏం సాధించారన్నది ఇప్పుడు ప్రశ్నార్థకంగా తయారైంది.

2019 నుంచి అనడం కంటే సార్వత్రిక ఎన్నికలు ఆరు నెలలు ముందు ఉంచి తిరుమల, తిరుపతిలో అనేక నిర్మాణ పనులు వేగవంతం అయ్యాయి. అందులో తిరుపతిలో రోడ్ల నిర్మాణతో పాటు టిటిడి నిధులతో అనేక పనులు చేశారు. ఆ వివరాలు మాత్రం రహస్యం. టిటిడి అధికారులు చెప్పరు, వివరాలు కూడా ప్రకటించరు. తిరుపతిలో కొన్ని రోడ్ల విస్తరణ పనులు చేశారు. ఇవి ఎన్నికలకవు ముందు జరగడం వల్ల ఆరోపణలు తప్పలేదు. అందులో ప్రధానంగా రేణిగుంట, కరకంబాడీ మార్గం, ఆర్‌టిఓ కార్యాలయం నుంచి రేణిగుంట వరకు బైపాస్‌రోడ్డుతో పాటు ఇంకొన్ని రోడ్ల నిర్మాణం సాగించారు. వాటిలవో ఒక్కొక్కటి రూ.15 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకు వెచ్చించారు. అలాగే చెర్లోపల్లి నుంచి వకుళామాత ఆలయం వరకు రూ.30 కోట్లతో రోడ్డు నిరిర్మంచారు. వాటికంటే ప్రధానంగా తిరుపతి రైల్వేస్టేషన్‌కు వెనుక బాగంలోని వందల ఏళ్లనాటి సత్రాలను కూలగొట్టారు. వీటిని రూ.600కోట్లతో మళ్లీ నిర్మించడానికి సమాయత్తం అయ్యారు. ఈపనులపై రాజకీయ దూమరం చెలరేగింది. ఈ పనులు వైఎస్ఆర్‌సిపి మద్దతుదారులు చేశారనేది ప్రధాన అభియోగం. ఇందులో భారీగా అవినీతికి ఆస్కారం ఉందని సందేహిస్తున్నారు.

ఈ పరిస్థితుల్లో 2024 ఎన్నికల తర్వాత రాష్ట్రంలో టిడిపి కూటమి అధికారంలోకి వచ్చింది. ప్రమాణస్వీకారం చేసిన రోజు రాత్రే సిఎం చంద్రబాబు నాయుడు కుటుంబ సమేతంగా తిరుమల దర్శనానికి వచ్చారు. పాలనలో ప్రక్షాళన తిరుమల నుంచే ప్రారంభిస్తాం అని సిఎం చంద్రబాబు ప్రకటించారు. రోజుల వ్యవధిలోనే టిటిడిలో జరిగిన అక్రమాలపై విచారణకు ఆదేశించారు. టిటిడిలో విజిలెన్స్ విభాగం ఉంది. దీనిని కాదని రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలోని విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్‌కు బాధ్యతలు అప్పగించారు. సుదీర్ఘ విచారణ టిటిడిల జరిగిన అవకతవకలపై 45 రోజుల్లోగా విచారణ చేసి నివేదిక ఇవ్వాలని విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్‌లోని 17 మంది అధికారులకు ప్రభుత్వం ఆదేశించింది. ఆ సమయం పూర్తయినా కూడా పరిస్థితి ఓ కొలికి రాకపోవడంతో మరో నెల రోజులు సమయం ఇవ్వాలని విజిలెన్స్ అధికారులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడంతో పొడిగించారు. ఈ పొడిగించిన సమయం కూడా మరో పది రోజుల్లో పూర్తికానుంది. టిటిడిలో రెండు నెలల పాటు సాగిన విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ విచారణలో అక్రమాలు గుర్తించినట్లు సమాచారం. దీంతో ఇంజనీరింగ్ విభాగంలోని 55 ఏఈలు, ఏఈఈ, డిఈఈలకు విజిలెన్స్ శాఖ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. కోట్ల రూపాయలతో నిర్మించిన రోడ్లు, భవనాలు, ఇతర పనుల్లో భారీగా అవకతవకలు జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించారని సమాచారం. దీంతో వారందరికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. చేసిన పనులకు సంబంధించి ఒక్కో అధికారికిక ఒకోరకంగా నోటీసులు ఇవ్వడం గమనార్హం.

ఇంజనీర్ల నిరసన..

తమకు జారీ చేసిన షోకాజ్ నోటీసులు వెనక్కి తీసుకోవాలని డిమాండ్‌పై ఇంజనీరింగ్ విభాగం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ (డిఈఈ), అసిస్టెంట్ ఇంజనీర్లు (ఏఈ) పట్టుబడుతున్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే, సహాయ నిరాకరణకు కూడా సంసిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇప్పటికే ఒకసారి తిరుపతి పరిపాలన భవనంలో ఇంజనీరింగ్ శాఖ అధికారులు ఉద్యోగుల్ పెన్‌డౌన్ చేసి, నిరసన వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్ పనులు పర్యవేక్షించిన ఇంజనీర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయడంపై భగ్గుమంటున్నారు.

పాలక మండలిలో చేసిన తీర్మానాలు మేరకు నిధులు ఇచ్చారు. అంతకుముందు తయారు చేసిన ప్రణాళిక మేరకు పనులు పర్యవేక్షణ చేసిన తమను నిందితులుగా చూడడం ఎంత మేరకు సమంజం అని ప్రశ్నిస్తున్నారు. విధి నిర్వహణలో ఎన్నోసార్లు అవార్డులు, రివార్డులు అందుకున్న మేము నోటీసులు తీసుకోవడం బాధాకరం అని తిరుపతి ఎంఎల్ఏ ఆరణి శ్రీనివాసులకు టిటిడి ఇంజనీర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులువ వినతిపత్రం ఇచ్చారు. ఎంఎల్ఏ వృతిరిత్యా కాంట్రాక్టర్ కావడకం గమనార్హం. ఆయన చిత్తూరుకు చెందిన వ్యక్తి అయినా తిరుపతితో పాటు తిరుమలలో కూడా గతంలో అనేక కాంట్రాక్టులు చేశారు. ఉద్దేశపూర్వంగా తప్పు చేసిన వారికి శిక్ష పడుతుంది. .విధినిర్వహణలో తెలియకుండా జరిగి ఉంటే నేను అండగా ఉంటా అని ఎంఎల్ఏ ఆరణి శ్రీణివాసులు ఇంజనీర్లకు స్వాంతన మాటలు చెప్పడం మినహా ఎలాంటి హామీ ఇవ్వలేదని తెలుస్తోంది.

మొత్తానికి టిటిడిలో జరిగిన అవినీతిని బట్టబయలు చేసి, బాధ్యులను శిక్షించాలనే టిడిపి కూటమి ప్రభుత్వ నిర్ణయం మరో ఫలితాన్ని రుచి చూసే పరిస్థితి ఏర్పడింది పనులు పర్యవేక్షించిన వారికి శిక్ష తప్పేలా లేదు. పనులు చేయాలని నిర్ణయించి, అనుమతులు మంజూరు చేయడం, నిధులు మంజూరు చేసిన అధికారులు భద్రంగానే ఉన్నారు. ఈ పరిస్థితుల్లో ఇంజనీర్లు తీసుకునే నిర్ణయం ఎలా ఉండబోతుందనేది వేచి చూడాలి.

ఇప్పటికే ఈవోను కలిసి, విన్నవించాం

ఈ వ్యవహారంపై మా సహచర అధికారులు ఈవో శ్యామలరావును కలిశారు. విజిలెన్స్ అధికారులు అడిగిన మేరకు వివరణ ఇవ్వండి. తర్వాత చూద్దాం అని అన్నారు. 14న మా అ సోసియేషన్ ఇదే అంశంపై భేటి అవుతోంది. తదుపరి కార్యాచరణపై చర్చించి, నిర్ణయం తీసుకుంటాం.

- మల్లికార్జున ప్రసాద్, టిటిడి ఇంజనీర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు

నిజాయితీగా పని చేస్తే వేధింపులా

30 ఏళ్లుగా సేవాభావం, నిజాయితీగా పని చేసిన తమను మానసిక వేదింపులకు గురి చేయడం సబబు కాదు. పాలకమండలిలో చేసిన తీర్మానం మేరకు అప్పగించిన పనులు చేశాం.

-టి.వీరప్రసాద్, టిటిడి ఇంజనీర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి

14న నిర్ణయిస్తాం

తిరుపతిలో పనిచేసే 51మంది ఇంజనీర్లకు నోటీసులు జారీ చేసిన విషయం వాస్తవం. నోటీసులు తీసుకున్న ఇంజనీర్లు వారి పర్యవేక్షించిన పనులకు సంబంధించి వివరణ ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. 14న అసోసియేషన్ సమావేశంలో చర్చించిన మీదట నిర్ణయాలు తీసకుంటాం.

- సురేష్‌రెడ్డి, టిటిడి ఇంజనీర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి

ప్రభుత్వ అధికార ప్రతినిధిగా గల్లా జయదేవ్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధికార ప్రతినిధిగా మాజీ ఎంపీ గల్లా జయదేవ్‌ని ప్రభుత్వం నియమించబోతున్నది.. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. చిత్తూరు జిల్లా తవణంపల్లి దిగుమాగం చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త మాజీ మంత్రి గల్లా అరుణకుమారి తనయుడు 2014, 2019లో గుంటూరు ఎంపీగా పోటీచేసి గెలిచారు. ఆ తర్వాత వైసిపి ప్రభుత్వంలో తన వ్యాపార లావాదేవీలపై కక్ష కట్టడంతో రాజకీయాల నుంచి తప్పుకుంటున్నానని అధికారం గా ప్రకటించారు. ముఖ్యంగా 2019 ఎన్నికల్లో జగన్ ప్రభంజనాన్ని తట్టుకుని మరీ ఆయన విజయం సాధించారు. అయితే పార్టీ ఘోరంగా ఓడిపోవడంతో, వైసీపీ ప్రభుత్వంలో ఆయన చాలా ఇబ్బందులను ఎదుర్కొన్నారు. వ్యాపార కార్యకలాపాలను వైసీపీ సర్కార్ దెబ్బ తీయడంతో గల్లా జయదేవ్ క్రియాశీల రాజకీయాలు నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించారు. అయితే ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఏపీలో కూటమి సర్కార్ ఘన విజయం సాధించడంతో గల్లా జయదేవ్‌కు చంద్రబాబు కీలక బాధ్యతలను అప్పగించాలని భావిస్తున్నారు. ఏపీలో నామినేటెడ్ పదవులు త్వరలో భర్తీ చేయడానికి రంగం సిద్ధమవుతోంది. ఈక్రమంలో గల్లా జయదేవ్‌కు కీలక పదవి అప్పగించాలని చంద్రబాబు ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తోంది. ఢిల్లీలో ఏపీ ప్రభుత్వ అధికార ప్రతినిధి పదవిని గల్లా జయదేవ్‌కు కేటాయించాలని టీడీపీ అధినేత ఆలోచనగా తెలుస్తోంది. గతంలో ఈ బాధ్యతలను కంభంపాటి రామ్మోహన్ రావు వహించేవారు. ఈసారి ఆ పదవిని గల్లా జయదేవ్‌కు కేటాయిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఢిల్లీలో అధికార ప్రతినిధిగా గల్లా జయదేవ్ సరిపోతారని చంద్రబాబు ఒక అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది. 2014 నుంచి 24 వరకు గుంటూరు పార్లమెంట్ సభ్యుడిగా గల్లా జయదేవ్ కొనసాగారు. 10 ఏళ్ల పాటు జాతీయ రాజకీయాలను దగ్గరుండి చూసిన వ్యక్తి కావడంతోనే గల్లా జయదేవ్ వైపు చంద్రబాబు మొగ్గు చూపిస్తున్నట్టు తెలుస్తోంది. స్వతహాగా పారిశ్రామికవేత్త అయిన జయదేవ్ వైసీపీ సర్కార్ నుంచి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అందుకే రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. అవసరమైతే త్వరలో తాను రాజకీయాల్లోకి వస్తానని అప్పుడే చెప్పారు. అందుకే పార్టీ కోసం కృషి చేసిన గల్లా జయదేవ్ అయితే ఢిల్లీలో రాష్ట్ర ప్రతినిధిగా సరిపోతారని చంద్రబాబు ఒక అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది. ఢిల్లీలో రాష్ట్ర ప్రతినిధిగా గల్లా జయదేవ్ నియామకం దాదాపు ఖరారు అయినట్లు సమాచారం.

మధ్యాహ్న భోజన నాణ్యత పెంచండి: ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకందజేస్తున్న మధ్యాహ్న భోజనంలో నాణ్యత పెంచాలని ఎస్ఎఫ్ఐ పట్టణాధ్యక్షుడు చుట్టు గురవయ్య కోరారు. మంగళవారం ఆయన పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకందజేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. గురవయ్య మాట్లాడుతూ పేద విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. మధ్యాహ్న భోజన పథకంపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని మండిపడ్డారు. ఫలితంగా పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఇళ్ల నుంచి క్యారీలు తెచ్చుకుని భోజనం చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనం సరఫరా చేస్తున్న ఏజెన్సీలు, కాంట్రాక్టర్లతో కొందరు ప్రధానోపాధ్యాయులు కుమ్మక్కు కావడంతో మెనూ, భోజన నాణ్యత అటకెక్కుతోందనీ, ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోందంటూ ఆగ్రహంవ్యక్తం చేశారు. జిల్లా విద్యాశాఖాధికారి వెంటనే స్పందించి మధ్యాహ్న భోజన పథకంపై ఓ కన్నేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నాయకులు నాగరాజు, శశి, సాయి, హేమంత్ పాల్గొన్నారు.

సత్యవేడులో తుడ పార్కు ఏర్పాటు చేయాలి

తుడా విసికి ఎమ్మెల్యే వినతి

తుడ విసికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

ప్రజాశక్తి -సత్యవేడు, పిచ్చాటూరు: సత్యవేడులో తుడా పార్కును ఏర్పాటు చేయాలని, వరదయ్య పాలెంలో డ్రైనేజీ నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తుడా విసి వెంకట నారాయణకు మంగళవారం వినతిపత్రం అందించారు. తిరుపతి తుడా కార్యాలయానికి చేరుకున్న ఎమ్మెల్యే తుడ విసితో మాట్లాడుతూ సత్యవేడు లోని మస్తాన్ కళ్యాణ మండపం నుండి తెలుగు గంగ కాలువ వరకు ఉద్యానవనం ఏర్పాటు చేయాలని కోరారు. వరదయ్య పాలెం ఎస్‌బిఐ నుండి గోవర్ధనపురం కాలువ వరకు, బత్తలవల్లం నుండి కారిపేట కాలువ వరకు సిసి డ్రైనేజీ నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే కోరారు. రూ.1.85 కోట్లతో తుడా నిధులతో పిచ్చాటూరులో నిర్మిస్తున్న టూరిజం పనులు పరిశీలన చాలని విసిని ఎమ్మెల్యే కోరారు. ఈ నెల 16 తేదీ సత్యవేడు నియోజక వర్గంలో పర్యటిస్తానని తుడ విసి వెంకటనారాయణ తెలిపినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

నాణ్యమైన విద్యను అందించండి: డిఇఒ

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించే విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించాలని డిఇవో శేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని నారావారిపల్లిలో ప్రభుత్వ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు పనిచేసే ఉండేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులకు పౌష్టిక పోషకాహారం కలిగిన ఆహారాలతో కూడిన భోజనం వడ్డించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంఇవో లలిత కుమారి, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డిఇవో శేఖర్

దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళ వారం బాలాజీ నగర్ ప్రగతి కార్యాలయంలో పేద మహిళలకు దుస్తులు పంపిణీ చేశారు. మన పాటి వంటి ఛారిటాల వారి కుటుంబ సభ్యులు మనపాటి శ్రీనివాసులు సాయంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవరుచు కోవాలన్నారు. ఈ కార్యక్ర మంలో మనపాటి శ్రీనివాసులు, సెక్రటరీ జి చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు రామ్మోహన్ రావు, ప్రభాకర్ పాల్గొన్నారు.

అన్నక్యాంటీన్‌కు పూర్వవైభవం

ప్రజాశక్తి - వెంకటగిరి: రాష్ట్రంలో అన్నాక్యాంటీన్లను ప్రారంభిస్తున్న ఎన్నికల హామీని టిడిపి కూటమి ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చేలా అడుగులు వేస్తోంది. పేదలకు ఆహార భద్రత కల్పించేందుకు అన్న క్యాంటీన్‌లను మళ్లీ నిర్మిస్తున్నారు. రూ.5కే భోజనం, అల్పాహారం లభించే రోజులు వెంకటగిరిలో తిరిగి కార్యరూపం దాల్చనుంది. పేదలకు ఆహారం అందించేందుకు ప్రభుత్వం మరుగున ఏర్పాట్లు చేస్తోంది. స్థానిక ఎంపిడివో కార్యాలయం ఆవరణలో ఉన్న అన్న క్యాంటిన్ పునరుద్ధరణ పనులు దాదాపు పూర్తి కావడంతో పేదలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో అన్నా క్యాంటీన్లు ఈనెల 15వ తేదీన లాంఛనంగా సీఎం చంద్రబాబు ప్రారంభించ నున్నారు. తొలి దశలో 100 అన్న క్యాంటీన్లు అందు బాటులోకి రానున్నట్లు వెంకటగిరిలో రెండవ దశలో అన్న క్యాంటీన్ ప్రారంభించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రషీద్ తెలిపారు.

ఎమ్మెల్యేకు బ్రహ్మోత్సవ ఆహ్వానం

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలంలోని పాపానాయుడుపేటలో ద్రౌపది దేవి సమేత ధర్మరాజుల స్వామి154వ బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, ఆయన సతీమణి బొజ్జల రిషితమ్మ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే పత్రికను అందించారు. టిడిపి సీనియర్ నాయకులు ఎస్‌సివి నాయుడుకి ఆహ్వాన పత్రికను అందించారు.

శ్రీరామలో దంత సంరక్షణపై అవగాహన

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి-కరకంబాడీ రోడ్డు మార్గంలోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాల జాతీయ సేవ విభాగం, తిరుపతికి చెందిన స్టార్ డెంటల్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో దంత సంరక్షణపై అవగాహన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ ఆర్ వంశీకృష్ణ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులకు దంతాలు వాటి ప్రాముఖ్యతను ఎలా సంరక్షించుకోవాలో వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె జయచంద్ర మాట్లాడుతూ దంతాలు ఎంతో ఉపయోగకరం అని, వాటిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ఈ సందర్భంగా స్టార్ డెంటల్ హాస్పిటల్ నిర్వాహకులకు, ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించటానికి అవకాశం కల్పిస్తున్న కళాశాల డైరెక్టర్ మన్నెం అరవిందుకుమార్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ మన్నెం రామిరెడ్డి, సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, వివిధ విభాగాధిపతులు, జాతీయ సేవ విభాగం ఆఫీసర్ ఎస్ చక్రిశ్రీధర్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంసిఎ ఫలితాల్లో రిమ్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతిలోని స్థానిక రాయలసీమ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్మెంట్ సైన్సెస్ కళాశాలలో ఎంసీఏ మూడో సెమిస్టర్ పరీక్ష ఫలితాల విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో విడుదల చేసిన మూడో సెమిస్టర్ పరీక్ష ఫలితాలలో తమ కళాశాల విద్యార్థులు మంచి జిపిఏ స్కోర్ ను సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జెట్టిపల్లి ప్రకాశ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8.5 పైన జిపిఏ మార్కులు సాధించిన వంశీ, ఎం.గోపిక, హేమలత, జోసెఫ్, మణికంఠను కళాశాల ప్రిన్సిపాల్, ఛైర్మన్ ఆనంద రెడ్డి, అధ్యాపకులు, విభాగాధిపతులు అభినందించారు.

కైలాసకోనకు ఆర్టీసీ బస్సు ఏర్పాటు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ప్రముఖ పర్యాటక కేంద్రమైన కైలాసనాథ కోనకు వెళ్లే భక్తులు, పర్యాటకుల సౌకర్యం కోసం పుత్తూరు నుండి కైలాసకోనకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేస్తున్నామని నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. మంగళవారం పుత్తూరు ఆర్టీసీ బస్టాండ్ లో నూతన బస్సును ప్రత్యేక పూజలు నిర్వహించి కైలాస కోనకు బస్సును ప్రారంభించారు. ఈ బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పొగాకు వినియోగ అరికట్టడంపై అవగాహన

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎంఆర్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో పొగాకు వినియోగం అరికట్టడంపై మంగళవారం సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ యు శ్రీహరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పొగాకు తాగడం వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నర్సప్ప, ఎన్సిడిపిఓ ఆర్‌డి పద్మావతి, ఎన్‌టిసిపిఎస్ డబ్ల్యూ అరుణ, సీఐ, ఎస్ఐలు, పొగాకు నియంత్రణ లీగల్ అడ్వైజర్ శివ శంకర్, అడ్వకేట్ ప్రదీప్, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీ ద్రౌపది దేవికి పట్టు వస్త్రాలు సమర్పణ

ప్రజాశక్తి - పుత్తూరు, టౌన్ : స్థానిక ద్రౌపది దేవి సమేత ధర్మరాజుల వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పట్టు వస్త్రాలు సారెను సమర్పించారు. శ్రీ కామాక్షి సమేత సదాశివేశ్వరాలయంలో కృష్ణుడు మందిరం నుంచి ద్రౌపది సమేత ధర్మరాజుల స్వామి దేవాలయం వద్దకు పట్టు వస్త్రాల సారెను ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం ఆలయం లో శ్రీ ద్రౌపది సమేత ధర్మరాజుల స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మాజీ మున్సిపల్ ఛైర్మన్ బిసిఆర్ యుగంధర్, జిల్లా అధికార ప్రతినిధి చినబాబు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు షణ్ముగం రెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షులు, గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ ఎన్ ధనపాల్, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు ఆర్ మాధవ నాయుడు, అశోక్, మున్సిపల్ కమిషనర్, కేఎల్‌ఎమ్ రెడ్డి, సిబ్బంది, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పట్టు వస్త్రాలు తీసుకెళుతున్న గాలి భాను ప్రకాష్

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : రాష్ట్రంలోనూ, దేశంలోనూ గిరిజనుల హక్కులకు సంబంధించిన న్యాయబద్ధత కల్పించాలని, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని సీనియర్ పాత్రికేయులు రాఘవ శర్మ పిలుపునిచ్చారు. రాజీలేని స్వాతంత్ర్య పోరాట యోధుడు, అమరవీరుడు అల్లూరి సీతారామరాజు శతవర్ధంతి సందర్భంగా విజయవంతమైన ఏఐడీఎస్ఓ తిరుపతి నగర విద్యార్థుల 4వ మహాసభలు మంగళవారం అంబేద్కర్ భవనంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ పాత్రికేయులు రాఘవశర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఉపాధి పనుల్లో టిడిపి గ్రూపుల పోరు

- పనులకు రాకున్నా 20 మంది పేర్లు నమోదు
- అధికారులతో అక్రమాలకు మార్గం
- కూలీల వాగ్వివాదం

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: జీవనాధారం లేకుండా కూలి పనుల నిమిత్తమై పట్టణాలకు వలస వెళ్లకుండా గ్రామ ప్రాంతాల్లోనే నిరు పేదలకు ఉపాధి కల్పనకు 'ఉపాధి హామీ'ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అయితే బాలాయపల్లి మండలంలోని పిగిలాం గ్రామంలో ఈ పథకం పనుల్లో టిడిపి నాయకులు మేట్ల ద్వారా పనులకు రాని వారి పేర్లను నమోదు చేస్తుండడంతో అక్రమాలకు దారి తీసింది. ఈ పథకం ఉన్నత లక్ష్యాన్ని నీరుకార్చేందుకు అటు అధికార, ఇటు ప్రభుత్వ నాయకులు యత్నిస్తున్నారని కూలీలు మంగళవారం వాగ్వివాదానికి దిగారు.

కూలి పనులకు రాకపోయినా నమోదు

కూలి పనులకు రాకపోయినా వారు పనులు చేశారని వారి పేర్లను మస్టర్లో నమోదు చేసుకొని హాజరు వేసి మేటు 70 శాతం, ఉపాధి కూలీలకు 30 శాతం ఇస్తామని ఒప్పందం కుదుర్చుకుని పిగిలాం గ్రామంలో అక్రమాలకు తెరలేపిన సంఘటన ఉపాధి కూలీలకు తెలియడంతో అదే పార్టీకి చెందిన ఇద్దరు నాయకులకు సంబంధించిన కూలీలు 'పనులకు రాని వారు పేర్లు ఎలా రాస్తారు?' అని ఓ నాయకుడు ఇంకొక నాయకుడిని ప్రశ్నించ డాడు. దీంతో ఉపాధి హామీ పనుల వద్ద వాగ్వివాదం చోటుచేసుకుంది.

ఏపీవో 20 పేర్లు రాసుకోమన్నాడు..

ఉపాధి ఏపీవోనే 20 మంది పేర్లు రాసుకోమని చెప్పాడని కూలి పనుల వద్ద మేటు బహిరంగంగా చెప్పాడు. ప్రభుత్వ సొమ్ము అక్రమాలకు పాల్పడేందుకు కంచె చేను మేసిన చందంగా బాలాయపల్లి మండలం ఏపీవో వ్యవహార తీరు వుందని కూలీలు ఆరోపిస్తున్నారు. తాము కష్టపడి పనిచేసిన కూలి గిట్టుబాటు రావటం లేదని, పనులకు రాని వారికి మాత్రం కూలి రూ.300 నుంచి తగ్గటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని పిగిలాం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులపై విజిలెన్స్ విచారణ చేయాలని ఉపాధి హామీ కూలీలు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించండి

కమిషనర్‌కు సిఐటియు, ఎస్‌ఎఫ్‌ఐ వినతి

ప్రజాశక్తి - నాయుడుపేట: గ్యాస్ పేరుతో ఎక్కడపడితే అక్కడ గుంతలు లోడి పట్టణ వాహనదారులకు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఈ సమస్య పరిష్కారం చాలని మున్సిపల్ కమిషనర్ ఎన్ జనార్ధన్ రెడ్డికి నాయుడుపేట మండల సిఐటియు ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు ప్రధాన కార్యదర్శి శివకవి ముకుంద మాట్లాడుతూ ఈ వర్షాలకు గుంతల్లో నీళ్లు నిలబడి చిన్న చిన్న వాహనాలు, ప్రజలు, విద్యార్థులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పెను ప్రమాదాలు చోటుచేసుకుని ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. మురుగు కాలువల్లో పూడిక తీత వేగవంతం చేయాలని, పైడు కాలువల వెడల్పు లేక మురుగు నీరు చేరి దోమలు విపరీతంగా ఉత్పత్తి అవుతున్నాయని ఈ దోమల వల్ల డెంగీ, మలేరియా జ్వరాలు వచ్చి ప్రజలు ఆస్పత్రుల పాలవుతున్నారన్నారు. పందులు పెంపకం దారులకు ఉండాలని స్థలం కేటాయించి ఆ స్థలంలో పందులను తరలించాలని కోరారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మనోజ్, శ్రీనంద, ప్రసాద్, శ్రీను, బాలాజీ, గుణ పాల్గొన్నారు.

కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న సిఐటియు, ఎస్ఎఫ్ఐ నాయకులు

అవయవ దానం మహాదానం

ప్రజాశక్తి - సత్యవేడు: అంతర్జాతీయ అవయవ దాన దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక శ్రీవిద్య ఇంగ్లీష్ మీడియం హైస్కూలు ప్రధానోపాధ్యాయులు నాగయ్య ఆధ్వర్యంలో విద్యార్థులు తమ చేతులతో గీసిన అవయవ చిత్ర పటాలతో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం వికెఎం కళ్యాణ మండపం పక్కన ఉన్న శ్రీ విద్యా పాఠశాల నుండి బయలుదేరి బస్టాండ్ రోడ్డు మీదుగా డొనేట్ ఆర్గాన్-సేవ్ లైఫ్ అనే నినాదాలతో గోడ గడియారం కూడలి వరకు ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో జి బాల సుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయులు నాగయ్య, శ్రీ విద్య పాఠశాల ఉపాధ్యా యులు, విద్యా ర్థులు పాల్గొ న్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

రామచంద్రాపురం(చంద్రగిరి): సమాజం లో ప్రతి ఒక్కరూ అవయవాలను దానం చేసి ఇతరులకు పునర్జన్మను ప్రసాదించి మానవత్వం చాటుకోవాలని మోహన్ బాబు విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య నాగరాజ రామారావు అన్నారు. మంగళవారం ఏ రంగంపేటలోని సాయినాథ్ నగర్ వద్దగల మోహన్ బాబు విశ్వవిద్యాలయంలో ప్రపంచ అవయవ దానం దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విసి ఆచార్య నాగరాజ రామారావు మాట్లాడుతూ మానవుల శరీరంలోని అవయవాలు మరణించిన కొన్ని గంటల వరకు సజీవంగా ఉంటాయని, ఆ అవయవాలను ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఇతరులకు ఉపయోగించు కునేందుకు అవయవ దానం చేస్తే మంచిదని సూచించారు. గుండె, కళ్లు, కిడ్నీలు మరణాంతరం ఇతరులకు దానం చేస్తే ఇతరుల జీవితాలలో వెలుగును నింపవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంబియూ రిజిస్ట్రార్ డాక్టర్ సారధి , డీన్ డాక్టర్ జగదీశ్ న్, పారా మెడికల్ విభాగం అధ్యాపకులు, విద్యార్థినివిద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మోహన్‌బాబు విశ్వవిద్యాలయం విసి నాగరాజ రామారావు

తిరుపతి సిటీ: శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్)లో మంగళవారం శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాల లెక్చరర్ గ్యాలరీలో ప్రపంచ అవయవదాన దినోత్సవస్త్ర నిర్వహించి నట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెం డెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డాక్టర్ ఆర్‌వి.కుమార్, మెడికల్ సూపరింటెం డెంట్ డాక్టర్ రామ్, శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఇన్చార్జ్ డాక్టర్ ముక్తేశ్వరయ్య, యురాలజి విభాగాధిపతి డాక్టర్ అనిల్ కమార్, డాక్టర్ అలోక్ సమంత్ దే, కమ్యూనిటి మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ నాగ రాజు, మెడికల్ అంకాలజీ డాక్టర్ భార్గవి పాల్గొని జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. డాక్టర్ ఆర్‌వి.కుమార్ మాట్లాడుతూ అవయవాలు దానం చేయడం ద్వారా ఇతరుల ప్రాణాలను నిలబెట్టవచ్చన్నారు. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సత్యవతి, గ్యాస్ట్రోఎంట్రాలజి విభాగాధిపతి డాక్టర్ వెంకటరామిరెడ్డి, మెడికల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ భార్గవి పవర్ పాయింట్ ప్రజంటేషన్ సమర్పించారు. శ్రీ పద్మావతి చిన్న పిల్లల హృదయాల డైరెక్టర్ డాక్టర్ శ్రీనాధ్ రెడ్డి, స్విమ్స్ ఆర్ఎంఓ డాక్టర్ కోటిరెడ్డి, డాక్టర్ ప్రకాష్, డాక్టర్ సునీల్, డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ హర్షవర్ధన్ వర్మ, డిప్యూటి డైరెక్టర్ ప్రభావతి, డిప్యూటి రిజిస్ట్రార్ యర్రంరెడ్డి, పిఆర్ఓ వి.రాజశేఖర్, ఎంఎస్‌డబ్ల్యూ ప్రసాద్ పాల్గొన్నారు.

రేణిగుంట: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రేణిగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలురు) అవయవదాన దినోత్సవ జనవిజ్ఞాన వేదిక మండల కార్యదర్శి కుప్పస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సభలో అవయవదాన సంఘం రాష్ట్ర నాయకుడు తెలుగు ఉపాధ్యాయుడు కుప్పయ్య, జనవిజ్ఞాన వేదిక కార్యదర్శి కుప్పస్వామి, ఉపాధ్యాయులు సుధాకర్‌రెడ్డి, శ్రీరాములు, వెంకటరమణ, ఓ.వెంకటరమణ ర్యాలీలో పాల్గొన్నారు.

ఆర్‌పిల సంఘం ఎన్నిక

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: సిఐటియు అనుబంధ శ్రీకాళహస్తి పట్టణ ఆర్‌పిల సంఘం కమిటీని స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య వ్యవహరించారు. ఆర్పీల సంఘం పట్టణ అధ్యక్షురాలుగా పి.సరళా దేవి, కార్యదర్శిగా జీ లక్ష్మి, ఉపాధ్యక్షులుగా ఏ అమ్ములు, ఏ సుభద్ర, సహాయ కార్యదర్శులుగా హబీబా, లత, గౌరవాధ్యక్షులుగా అంగేరి పుల్లయ్య, కోశాధికారిగా శ్రీవల్లి ఎన్నికయ్యారు. సభ్యులుగా హేమలత, పద్మావతి, మంజుల, ఉమామహేశ్వరి, అర్చన, సత్యవాణి, అనిత, వరలక్ష్మి, భారతి, మునిరత్నం, ఇందిరను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు సంయుక్తంగా మాట్లాడుతూ పట్టణ పరిధిలో పేదల ఆర్థిక స్థితి గతులను మెరుగుపర్చేందుకు దశాబ్దాలుగా నిరంతరం పనిచేస్తున్న ఆర్‌పిలకు ఏ కష్టం వచ్చినా సీఐటీయూ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాడతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య పాల్గొన్నారు.

ప్రజా ఆరోగ్య సదస్సుకు మంత్రికి ఆహ్వానం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ : తిరుపతిలో ఈనెల 29, 30, 31 తేదీలలో మూడు రోజులు పాటు నిర్వహించనున్న ప్రజా ఆరోగ్య రాష్ట్ర సదస్సుకు రాష్ట్ర వైద్యఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, వైద్యవిద్య మంత్రి సత్యకుమార్ యాదవ్ ను కలిసి ప్రజా ఆరోగ్య సదస్సు ప్రతినిధులు సదస్సుకు రావాలని ఆహ్వాన పత్రికను అందించారు. విజయవాడలోని మంత్రి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎస్‌వి వైద్య కళాశాలలో సామాజిక వైద్య విభాగం ఆధ్వర్యంలో 'వన్ హెల్త్' ప్రజాఆరోగ్య సమస్యలపై మూడు రోజుల సదస్సు నిర్వహిస్తామని, అందులో ప్రజాఆరోగ్యం, పలు అంశాలపై చర్చిస్తామని తెలిపారు. అనంతరం సదస్సు ప్రతినిధులు వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ సెక్రటరీ కృష్ణ బాబును మర్యాద పూర్వకంగా కలిసి ప్రజాఆరోగ్య సదస్సుకు ఆహ్వానించారు. డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్, వైద్య విద్య సంచాలకులు డాక్టర్ నరసింహంను సదస్సుకు రావాలని ఆహ్వానిం చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సునీత శ్రీగిరి , ప్రజాఆరోగ్య సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ, సదస్సు జాయింట్ సెక్రెటరీ వీర కిరణ్ పాల్గొన్నారు.

మార్కెట్‌ను శుభ్రంగా ఉంచండి: కమిషనర్

ప్రజాశక్తి- తిరుపతిటౌన్: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్‌ను శుభ్రంగా ఉంచుకోవాలని, ఆక్రమణలు తొలగించాలని కమిషనర్ ఎన్ మౌర్య వ్యాపారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఇంజినీరింగ్, రెవెన్యూ, పారిశుధ్య విభాగపు అధికారులతో కలసి కమిషనర్ మార్కెట్‌ను పరిశీలించారు. మార్కెట్లో పలుచోట్ల మురుగునీరు, చెత్తాచెదారం ఉండడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. మురుగు కాలువలు శుభ్రం చేయాలని ఇంజినీరింగ్, చెత్త తొలగించాలని హెల్త్ అధికారులను ఆదేశించారు. నగరంలో నిర్వహిస్తున్న డ్రింకింగ్ వాటర్ ఫ్రమ్ ట్యాప్ సర్వేను పరిశీలించి అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం పెరేడ్ గ్రౌండ్‌లో జరుగుతున్న ప్రంద్రాగస్టు ఏర్పాట్ల ను పరిశీలించారు. అన్ని ఏర్పాట్లు పక్కగా చేయాలని, శానిటేషన్ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశిం చారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మునిసిపల్ ఇంజినీర్ వెంకట్రామిరెడ్డి, డీఈలు విజయకుమార్ రెడ్డి, రాజు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, ఆర్‌ఓ కేఎల్‌వర్మ, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి పాల్గొన్నారు.

మార్కెట్ పరిశుభ్రతను తనిఖీ చేస్తున్న కమిషనర్

నిర్దేశిత గడువులోపు నాణ్యతగా చేపట్టాలి: సీఈఓ

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: రాష్ట్రం లోని అన్ని జిల్లాల్లో ఫొటో ఎలెక్టోరల్ జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ 2025 కోసం బిఎల్‌ఓలు వారి పరిధిలోని ఇంటింటి గృహ సందర్శన చేసి పరిశీలించాలని రాష్ట్ర చీఫ్ ఎలెక్టోరల్ అధికారి వివేక్ యాదవ్ అన్ని జిల్లాల కలెక్టర్లకు సూచించారు. మంగళవారం వెలగపూడి సచివాలయం నుండి అన్ని జిల్లా కలెక్టర్లతో ఎస్ఎస్ఆర్ - 2025 పై, క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్ పై తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేయగా తిరుపతి కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డిఆర్‌ఓ పెంచల కిషోర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా సిఈఓ మాట్లాడుతూ ఆగస్టు 20 నుండి బిఎల్‌ఓలు ఇంటి ఇంటికీ వెళ్లి గృహ సందర్శన చేసి ఓటర్ల జాబితా పరిశీలించి ఈ వివరాలను ధృవీకరణ చేయాలని కలెక్టర్లు, ఈఆర్‌ఓలు, ఎఈఆర్‌ఓలకు సక్రమంగా షెడ్యూల్ మేరకు నాణ్యతగా జరిగేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. షెడ్యూల్ మేరకు నిర్దేశించిన ఎస్ఎస్ఆర్ 2025 ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. ఆ మేరకు చర్యలు చేపడతామని జెసి, సిఈఓకు వివరించారు. ఈసమావేశంలో ఎస్డిసి రామ్ మోహన్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి -వెంకటగిరి: రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చునని వెంకటగిరి వ్యవసాయ శాఖ ఏడీ ఎం నాగార్జునసాగర్ తెలిపారు. మండలంలోని పాపమాంబాపురం గ్రామంలో సాగవుతున్న పెసర ఐపీఎం 2-14 రకం పంటను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ పంటలో పల్లాకు తెగులు ఆశించడంతో సిఫారసు మేరకు ఎకరానికి ఎసిపేట్ 400 గ్రాములు, హెక్సా కొనాజోల్, మల్టి కే ను ఒక కిలో కలిపి పిచికారీ చేసిన పంటను ఆశించిన తెగులు నివారణ అయి పూత బాగా వచ్చి మంచి దిగుబడి వస్తుందన్నారు. చౌడు భూములలో వరి వేసిన రైతులకు దిగుబడి తగ్గకుండా వరి పంట ఎదుగుదలకు దోహద పడేలా ప్రతిరోజూ మంచి నీటిని మార్చి అందించా లని సూచించారు. వరి పంట కోసిన తర్వాత చౌడు నివారణకు జిప్సం, పచ్చి రొట్ట పైరులు వేసి నివారించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎవో సుజాత, ఎఈవో రామ్మోహన్, విఎఎ రేఖ , గ్రామ రైతులు పాల్గొన్నారు.

'నాయీ బ్రాహ్మణులకు చోటు కల్పించాలి'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నాయి బ్రాహ్మణులకు దేవాలయాల పాలక మండళ్లలో చోటు కల్పించాలని నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు ఆవులపాటి బుజ్జిబాబు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతి రోజూ తిరుమల శ్రీవారి క్షేత్రంలో స్వామికి నిర్వహించే కైంకర్యాలలో నాయీ బ్రాహ్మణు ల సేవలు ఉంటాయన్నారు. తిరుమలకు వచ్చే భక్తులకు తలనీలాలు తీస్తూ నాయీ బ్రాహ్మణులు సేవలు చేస్తుం టారన్నారు. గత ఏడాది రాష్ట్ర గవర్నర్ జారీ చేసిన ఆర్డినెన్స్ ప్రకారం రాష్ట్రంలోని దేవాలయాల పాలక మండలిలో నాయీబ్రాహ్మణులకు చోటు కల్పించాలని రాజపత్రం విడుద ల చేశారని గుర్తు చేశారు. కూట మి గెలుపుకోసం శక్తి వంచ న లేకుండా పని చేశా మని, తిరుమ లలో పనిచేస్తున్న కళ్యాణ కట్ట క్షురకుల కోసం పోరాటం చేసిన టిటిడి మహిళా క్షురకు ల వ్యవస్థాపక అధ్యక్షులు రాధాదేవికి టిటిడి బోర్డులో స్థానం కల్పించాలని సిఎం చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు విజ్ఞప్తి చేశామన్నారు. ఈ సమావేశంలో సుధాకర్, వెంకీ, కమల్, రంగయ్య, బాలాజీ, హరి బాబు, మారుతిరావు, శివవంప్రసాద్, గణేష్ మోహన్ పాల్గొన్నారు.

క్రైం న్యూస్

హత్య కేసులో నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలో బనిగి సాహెబ్ పేటలో ఈనెల 10 వ తేదీన హత్య సంఘటన చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితులను ఒకటవ పట్టణ పోలీస్ లు అరెస్ట్ చేశారు. గూడూరు ఒకటవ పట్టణ పోలీస్ కార్యాలయంలో గూడూరు డిఎస్పీ వివి రమణ కుమార్ విలేకరులతో మాట్లాడుతూ గూడూరు పట్టణంలోని బనిగి సాహెబ్ పేటకు చెందిన అల్లా బక్షుకు తమిళనాడు ప్రాంతానికి చెందిన సోనియాతో వివాహమైందన్నారు. గత కొంతకాలంగా వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయని, బనిగిసాహెబ్ పేటలో సోనియా ఒంటరిగా నివాసం ఉంటోందని, సోనియా ఆమె సోదరులు జకీర్, షకీర్ లు సోదరితో మాట్లాడేందుకు వెళ్లగా అదే సమయంలో అల్లా భక్షు అతని తల్లిదండ్రులు రోకలి బండతో సోనియా, ఆమె సోదరులపై దాడి చేశారన్నారు. దీంతో తీవ్ర గాయాలైన జాకీర్‌ను గూడూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకు వెళుతుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడన్నారు. కేసు దర్యాప్తు చేసి నిందితులైన అల్లాభక్షు, చాన్ బాషా, షర్ఫు లను గూడూరు మండల పరిధిలోని తిప్పావరప్పాడు జంక్షన్ వద్ద అరెస్ట్ చేశామన్నారు. ఈ కేసును త్వరిత గతిన ఛేదించిన పట్టణ సిఐ శేఖర్ బాబు, ఎస్ఐ శ్రీహరి బాబు, సిబ్బందిని అభినందించారు.

చెత్త నుండి సంపద తయారు చేసుకోవాలి: డిఎల్‌పివో

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: పంచాయతీలు చెత్త నుండి సంపదను తయారు చేసుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గూడూరు డివిజన్ డిఎల్పీవో వెంకటరమణ పేర్కొన్నారు. బాలాయపల్లి మండల కేంద్రంలో స్త్రీశక్తి భవనంలో చెత్త నుండి సంపద తయారీ పంచాయతీ పరిధిలోని గ్రీన్ అంబాసిడర్లకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త సేకరణ సమయంలో పొడి, చెత్త తడి చెత్తను వేరువేరుగా సేకరించాలని సూచించారు. చెత్త కేంద్రాలలో కంపోస్ట్ ఎరువు తయారీ మండలంలోని అన్ని పంచాయతీల చెత్త సేకరణ కేంద్ర నిర్వాహకులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కంపోస్ట్ ఎరువు తయారు చేసి రైతులకు విక్రయించగా వచ్చిన నగదుతో పంచాయతీలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ వినీల్ కుమార్, ఈఓఆర్డీ శ్రీనివాసులు, పంచాయతీ సర్పంచులు, చెత్త సేకరణ కేంద్ర గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

16 నుండి 30 వరకు రెవెన్యూ సదస్సులు : తహశీల్దారు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: నాగలాపురం మండలంలోని 12 రెవెన్యూ గ్రామాలలో ఆగస్టు 16 వ తేది నుండి 30వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిం చనున్న ట్లు తహశీల్దార హనుమాన్ నాయక్ తెలిపారు. 16న టిపి కోట, 17న బీరకుప్పం, 19న కడలిపేట, 20న ఎస్ఎస్‌పురం, 21న వెల్లూరు, 23న కాలంజేరి, 24న వేంబాకం, 27న బికె బేడు, 28న కారణి, 29న సురుటుపల్లి, 30న తేదీ నాగలాపురంలో ఈ సదస్సులు నిర్వహించనున్నట్లు తహశీల్దార, సర్వేయర్, ఏఎస్ఓ, వీఆర్వో పాల్గొంటారన్నారు. అనంతరం ఆయన రెవెన్యూ గ్రామాలలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, దేవాదాయ శాఖ, అటవీశాఖ, వక్ఫ్ నుండి ఒక అధికారి హాజరవుతారని ఆయన తెలిపారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ఒకటవ వార్డులో దాసి నాగరాజు మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాశం సునీల్ కుమా ర్ అంత్యక్రియలకు ఐదు వేల రూపాయలను స్థానిక నా యకుల ద్వారా మృతుని కుటుం బ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకు లు అడపాల శివ కుమార్, అడపాల రాము, పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి: ఎంపీపీ

మాట్లాడుతున్న ఎంపిపి మునివేలమ్మ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: గ్రామాల అభివృద్ధికి అందరూ కలిసి కృషి చేయాలని మండల అధ్యక్షురాలు ముని వేలమ్మ పేర్కొన్నారు. మంగళ వారం పుత్తూరు మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూ సమస్యలపై ఈనెల 16వ తేదీ నుంచి రెవెన్యూ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తామని తెలిపారు. రెవెన్యూ సమస్యలు తెలిపితే అక్కడికక్కడే సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. ఎంపీడీవో ఇందిరమ్మ మాట్లాడుతూ అధికారులు గ్రామ సమస్యలు పరిష్కరించాలన్నారు. అనంతరం సర్పంచ్ మురళీమోహన్ మాట్లాడుతూ ఎగువ గూళూరులో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు మునుస్వామి రెడ్డి, విమలమ్మ, ఎంఈఓ తిరుమల రాజు, బాలసుబ్రహ్మణ్యం, ఆర్టికల్చర్ అధికారి వెంకట సౌజన్య, వ్యవసాయ శాఖ ఏఈ కోదండయ్య, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు, కో ఆప్షన్ మెంబర్ పాల్గొన్నారు.

రిపోర్టర్‌కు పరామర్శ

ప్రజాశక్తి - క్యాంపస్: ఆంధ్రజ్యోతి రిపోర్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రాజు రోడ్డు ప్రమాదంలో గాయాలు కాగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి రాజును పలకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆంధ్రజ్యోతి సీనియర్ రిపోర్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రాజు విధి నిర్వహణలో భాగంగా రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసు కుంటున్నట్లు తెలుసుకున్న చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి పార్టీ కార్యకర్తలతో కలిసి రిపోర్టర్ రాజు ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్యం తొందరగా కుదుటపడాలని, విధి నిర్వహణలో మళ్లీ చురుకుగా పాల్గొనాలని ఆమె ఆకాంక్షించారు.

ఈవోను కలిసిన జిల్లా ప్రజా రవాణా అధికారి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: టీటీడీ ఈవో శ్యామల రావును ఏపీఎస్‌ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి టి చెంగల్ రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. టీటీడీ పరిపాలన భవన్లోని ఈవో కార్యాలయంలో ఆయన కలిసిన చంగల్ రెడ్డి త్వరలో నిర్వహించనున్న తిరుమల బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడం పై చర్చించారు.

'చిచ్చు పెట్టడానికే వర్గీకరణ'

మాట్లాడుతున్న మల్లెల వెంకట్రావు

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): దేశ వ్యాప్తంగా ఉన్న మాలల హక్కులను కాలరాయడానికి, ఎస్సీ కులాల మధ్య చిచ్చు పెట్టడానికే వర్గీకరణ అంశాన్ని తీసుకొచ్చారని, దీనిపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం ఇచ్చిన తీర్పుపై ఈ నెల 7న రివ్యూ పిటీషన్ దాఖలు చేశామని మాల మహాసభ జాతీయ అధ్యక్షులు మల్లెల వెంకట్రావు తెలిపారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ 'రాజ్యాధికారాన్ని ఏనాడైనా దేశంలోని అన్ని వర్గాలకు చెందిన ప్రజలకు విభజించారా?' అని ప్రశ్నించారు. ఈ వర్గీకరణ అంశం తెరపైకి రావడంతో ప్రశాంతంగా ఉన్న దేశంలో అలజడి సృష్టించారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1997లో అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు ఎస్సీ కులాల రిజర్వేషన్ల వర్గీకరణ కోసం ఎ,బి,సి,డి చట్టాన్ని తీసుకొస్తే దీనిపై మాల మహాసభ, కొన్ని సంఘాలు ఉమ్మడి ఏపి హైకోర్టులో రిట్ పిటీషన్ దాఖలు చేయడంతో జస్టిస్ లిబర్ హాన్ న్యాయ మూర్తుల ధర్మాసనం ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్ల వర్గీకరణ అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి వుందని 421 రేషియోలో తీర్పు ఇచ్చిందన్నారు. రాజ్యాంగంలో వెనుకబడిన తరగతులు అనే పదాలు చేర్చక ముందే షెడ్యూలు కులాలు, తెగలు అనేవి భారత ప్రభుత్వంలో నిర్వహిం చేవారన్నారు. ఇంద్రసహానీ కేసులో వెనుకబడిన తరగతులను ఉప విభజన చేసే తీర్పు ఉందని, ఎస్సీ, ఎస్టీలను వర్గీకరించే అధికారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రాజ్యాంగం ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డెప్ప, ధనశేఖర్ పాల్గొన్నారు.

యువతలో దేశభక్తి భావన పెంపు: కమిషనర్

తిరుపతి టౌన్: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం స్థానిక మహతి ఆడిటోరియం నుండి ఎస్వీ యూనివర్సిటీ స్టేడియం వరకు టూరిజం, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో నగరపాలక కమిషనర్ నారపు రెడ్డి మౌర్య, తిరుపతి ఎస్పీ సుబ్బ రాయుడు, అధికారులతో కలసి పాల్గొన్నారు. ప్రాంతీయ సంచాలకులు టూరిజంశాఖ అధికారి రమణ ప్రసాద్, జిల్లా పర్యాటక శాఖ అధికారి రూపేంద్రనాథ్ రెడ్డి, ప్రొఫెసర్ రజనీ, విద్యార్థులు పాల్గొన్నారు.

గూడూరు టౌన్ : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గూడూరు పట్టణంలోని రైల్వే స్టేషన్ నుండి శ్రీ వివేకానంద కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో 75 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని రైల్వే స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వరరావు ప్రారంభించారు.

పిచ్చాటూరు: ప్రతి పాఠశాలలో కిచెన్ షెడ్ ఏర్పాటు చేయాలని ఎంఈవో మండల విద్యాశాఖ అధికారి కె హేమమాలిని సూచించారు. హెచ్ యుగంధర్ రాజు ఆధ్వర్యంలో పిచ్చాటూరు మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు మంగళవారం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

నాయుడుపేట: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నాయుడుపేట పురవీధుల్లో మున్సిపల్ కమిషనర్ ఎం జనార్ధన్ రెడ్డి మున్సిపల్ సిబ్బందితో మంగళవారం ర్యాలీ నిర్వహించారు